‘జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి’

- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి

తెలంగాణచౌక్, జూలై 14: జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలి పేదలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయం (ముకుందలాల్ మిశ్రా భవనం)లో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో కనీస వైద్యసదుపాయాలు లేవని ఆరోపించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, జాండీస్ తదితర వ్యాధులు ప్రబలి, దాదాపు ప్రతి కుటుంబంలో జ్వర పీడితులు ఉన్నారని తెలిపారు. వారికి వైద్య సేవలందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సదుపాయాలు లేకపోవడంతో పేదలు ప్రైవేట్ హాస్పిటల్స్‌ను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ హాస్పిటళ్ల యాజమాన్యాలు రక్త పరీక్షలు, స్కానింగ్ లాంటి టెస్టులతో డబ్బులను దండుకుంటున్నాయని ఆరోపించారు. వెంటనే ప్రతి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నగరంలోని ఖాళీ స్థలాల్లో నీరు నిలువకుండా మున్సిపల్ పాలకవర్గం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటళ్లలో ఇష్టారీతిగా అబార్షన్లు చేస్తున్న డాక్టర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎంపీపీకి సన్మానం

వనితాదేవేందర్ రెడ్డి దంపతులను సత్కరిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

తిమ్మాపూర్, జూలై 14: ఇటీవల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా మాజీ ఎంపీపీ కేతిరెడ్డి వనితాదేవేందర్ రెడ్డి దంపతులను తిమ్మాపూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా సత్కరించారు. గ్రామ రెడ్డి సంఘం భవనానికి నిధులు మంజూరు చేయించి సంఘ అభివృద్ధికి కృషి చేశారని నాయకులు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎడ్ల ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి సంతోష్ రెడ్డి, నాయకులు వావిలాల అంజిరెడ్డి, కేతిరెడ్డి అంజిరెడ్డి, రామిరెడ్డి జగ్గారెడ్డి, సంపత్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సప్తగిరి కాలనీలో ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

మాట్లాడుతున్న మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్

విద్యానగర్, జూలై 14: కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం సప్తగిరి కాలనీ, విజేత నివాస్ అపార్ట్‌మెంట్‌లో ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 100 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో మొదలగు సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలు చేశారు. హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చీటి కార్తీక్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రతిష్టా రావు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ... సప్తగిరి కాలనీ ప్రజలు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల జబ్బులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతోనే ఈ వైద్య శిబిరం నిర్వహించామన్నారు. అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందుబాటులోకి తేవడమే కాకుండా సెలవులతో సంబంధం లేకుండా నిరంతరం సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షుడు గడ్డం అజయ్ రెడ్డి, మెంబర్స్ జనార్దన్ రెడ్డి, రఘు మోహన్, రవికాంత్, రవీందర్ రెడ్డి, గీతా రెడ్డి, రామానంద్ తీర్థ, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571

కరాటేలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

చిచ్చర పిడుగులు

- అంతర్జాతీయ స్థాయి కరాటే వేదికలపై సత్తా చాటుతున్న చిన్నారులు
- పాల్గొన్న ప్రతి టోర్నమెంట్‌లో పతకాలు
- వివిధ గ్రాండ్ చాంపియన్‌షిప్‌లూ కైవసం

వారంతా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు.. కానీ, జాతీయ, అంతర్జాతీయ స్థాయి కరాటే వేదికలపై చిచ్చర పిడుగులుగా మారి సత్తా చాటుతున్నారు. కరీంనగర్‌లోనే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల్లో జరిగే పోటీల్లో సైతం ప్రతిభను చాటుతున్నారు. ప్రతి టోర్నమెంట్‌లో పతకాలు సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు. పట్టుదల, కఠోర శ్రమతో ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు. ఇప్పటికే మలేషియా, థాయిలాండ్, నేపాల్ దేశాలతో పాటు భారత్‌లోని ఢిల్లీ, గోవా, హర్యానా, మధ్యప్రదేశ్, హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలతో పాటు చాంపియన్‌షిప్, గ్రాండ్ చాంపియన్‌షిప్‌లనూ కైవసం చేసుకున్నారు. సీనియర్ కరాటే కోచ్ ఆర్ ప్రసన్నకృష్ణ ఆధ్వర్యంలో నగరంలోని భగత్‌నగర్‌లోని వివేకానంద విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో శిక్షణ పొందుతూ కరాటే పోటీల్లో రాణిస్తున్న నగరానికి చెందిన క్రీడాకారులపై కథనం..

-కొత్తపల్లి, జూలై 14

ఒలింపిక్స్ పతకమే ధ్యేయం

నగరంలోని వాణీనికేతన్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న శ్రీతికేనందన్ ఇటీవల నిర్వహించిన నేపాల్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో కటా విభాగంలో సిల్వర్ మెడల్, కుమిటీ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించి సత్తాచాటాడు. అలాగే ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ చాంపియన్‌షిప్, వైజాగ్‌లో జరిగిన సౌత్ ఇండియా చాంపియన్‌షిప్‌లో కటా విభాగంలో గోల్డ్ మెడల్, గోవాలో నిర్వహించిన ఆల్ ఇండియా చాంపియన్‌షిప్‌లో కటా విభాగంలో గోల్డ్, కుమిటీ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. ఒలింపిక్స్‌లో జరిగే కరాటే పోటీల్లో పాల్గొని పతకం సాధించడమే తన ధ్యేయమంటున్నాడు.

ఆత్మస్థైర్యంతో పతకాలు

కరీంనగర్‌లోని అచీవర్స్ అక్టివ్ హైస్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న వీ అక్షర ఆత్మస్థైర్యం కోసం కరాటేలో శిక్షణ పొందుతుండగా, పోటీల్లో సైతం విశేషంగా రాణిస్తూ అబ్బుర పరుస్తున్నది. కరీంనగర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో కటా విభాగంలో గోల్డ్, కుమిటీ విభాగంగా బ్రాంజ్ మెడల్స్ సాధించింది. అలాగే హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో కటా విభాగంలో గోల్డ్ మెడల్, కరీంనగర్ నిర్వహించిన ఇండో నేపాల్ చాంపియన్‌షిప్‌లో కటా విభాగంలో గోల్డ్, కుమిటీ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. కరాటే శిక్షణతో ఆత్మస్థైర్యంతో ఐపీఎస్ అయి శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానంటున్నది.

పంచ్ విసిరితే పతకమే

నగరంలోని విద్యాధరి హైస్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న మణితేజ కరాటేలో విశేషంగా రాణిస్తున్నాడు. పాల్గొన్న ప్రతి పోటీల్లో పతకం సాధిస్తూ ఔరా అనిపిస్తున్నాడు. ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ చాంపియన్‌షిప్‌లో కటా విభాగంలో సిల్వర్ మెడల్, వైజాగ్‌లో నిర్వహించిన సౌత్ ఇండియా చాంపియన్‌షిప్‌లో కటా విభాగంలో గోల్డ్, కుమిటీ విభాగంలో సిల్వర్ మెడల్స్ సాధించాడు. అలాగే కరీంనగర్‌లో జరిగిన ఇండో నేపాల్ చాంపియన్‌షిప్, ఆల్ ఇండియా చాంపియన్‌షిప్ పోటీల్లో కటా విభాగంలో గోల్డ్, కుమిటీ విభాగంలో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి ప్రతిభను చాటాడు. కరాటేపై ఇష్టంతో చిన్నప్పటి నుంచి నేర్చుకుంటున్నానని, దీంతో ఏదైనా సాధించే ఆత్మస్థైర్యం వచ్చిందంటున్నాడు.

తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు

గతంలో క్రీడలన్నా, కరాటే శిక్షణన్నా పేరెంట్స్ ఎక్కువగా ఆసక్తి చూపేవారు కాదు. కానీ, ఇప్పుడు వారిలో గణనీయమైన మార్పు వచ్చింది. చదువుతో పాటు పిల్లలకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. తల్లిదండ్రులు చూపిస్తున్న ప్రోత్సాహంతోనే పిల్లలు కరాటేలో విశేషంగా రాణిస్తున్నారు. కరాటేతో పిల్లల్లో ధైర్యం రెట్టింపు కావడంతో పాటు దృఢత్వంగా మారుతారు. వారిలో ఏదైనా సాధించగలమన్న ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మా వద్ద శిక్షణ పొందుతున్న చిన్నారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికల్లో పతకాలు సాధిస్తూ ప్రతిభను చాటుతున్నారు. ఒత్తిళ్లతో కూడిన చదువు, పోటీతత్వం పెరిగిన నేపథ్యంలో క్రీడలు, కరాటే శిక్షణ వారిలో ఉత్సాహాన్ని నింపుతాయి.

- ఆర్ ప్రసన్నకృష్ణ, కరాటే కోచ్

సీఐటీయూ కరపత్రాల పంపిణీ

తెలంగాణచౌక్, జూలై14: ప్రైవేట్ పాఠశాలల్లో డిస్ట్రిక్ట్ ఫీజు రెగ్యులేషన్ కమిటీ నిర్ణయించిన మేరకే ఫీజులు తీసుకోవాలని, సిబ్బందికి లేబర్ యాక్ట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ముద్రించిన కరపత్రాలను జిల్లా సహాయ కార్యదర్శి శ్రీలత ఆధ్వర్యంలో ఆదివారం అల్గునూర్ గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలను అదుపుచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. డిస్ట్రిక్ట్ ఫీజు రెగ్యులేషన్ కమిటీ సక్రమంగా పని చేయడం లేదని విమర్శించారు, ప్రతి పాఠశాలలో పాలక మండలిని ఏర్పాటు చేయాలన్నారు. విద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

ఎరడపల్లిలో మోటార్ బైక్ చోరీ

శంకరపట్నం, జూలై 14: ఎరడపల్లి గ్రామంలో మోటార్ బైక్ చోరీకి గురైంది. బాధితుడి కథనం ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన దుస్స నాగరాజు కొంతకాలంగా ఎరడపల్లి గ్రామంలో మెడికల్ షాపు నిర్వహిస్తూ అక్కడే నివసిస్తున్నాడు. శనివారం రాత్రి ఎప్పటి లాగే షాపు మూసి, బైక్ షాపు ముందు ఉంచి ఇంట్లో నిద్రించాడు. ఉదయం నిద్ర లేచి చూడగా ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్ మాయమైంది. తన బైక్‌ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

వాహనాల దారిమళ్లింపు

సైదాపూర్, జూలై 14: మండలంలోని సోమారం శివారులోని సైదాపూర్-మొలంగూర్ ప్రధాన రహదారిపై కాకతీయ కెనాల్ వద్ద బ్రిడ్జి కుంగిపోయి ప్రమాదకరంగా మారడంతో దారిపై ముళ్లకంచెలు వేసి వాహనాలను దారి మళ్లించారు. సైదాపూర్ నుంచి వచ్చేవారు కొత్తగట్టు రహదారి గుండా కరీంనగర్ రహదారి వైపు, మొలంగూర్ నుంచి వచ్చేవారు కొత్తగట్టు నుంచి వెన్నంపల్లి మీదుగా రావాలని స్థానికులు తెలిపారు.

జంబల్ గడ్డ.. నా అడ్డా

- నేను ఎక్కడున్నా.. మీ బిడ్డనే
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- కాపువాడలో మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం బాధ్యులు

విద్యానగర్, జూలై 14: ‘జంబల్ గడ్డ (కాపువాడ) నా అడ్డా. నేను ఎక్కడున్నా మీ బిడ్డనే’ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ లోని కాపువాడలో కాపుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను బతికినన్నాళ్లూ ఒకే పార్టీలో, ఒకే సిద్ధాంతంతో ధర్మ రక్షణే ధ్యేయంగా, పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. అందుకోసం ఎందాకైనా పోరాడుతానన్నారు. కాపు వాడలో గడిపిన క్షణాలు, చేసిన పోరాటాలను గుర్తు చేసుకుంటూ ప్రజల కోసం నిరంతరం పనిచేశానని పేర్కొన్నారు. తనకు ఇచ్చిన పదవిని ఒక బాధ్యతగా భావిస్తానన్నారు. కాపు వాడలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బండి సంజయ్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, బొమ్మ రాధాకృష్ణ, బొమ్మ రాతి రామచంద్రం, తిరుమణి రాజేశం, కర్ర రాజశేఖర్, కళ్యాడపు ఆగయ్య, బొమ్మ జయశ్రీ, వరాల జ్యోతి, సాధవేని శ్రీనివాస్, తోట రమణ, బొల్లం లింగమూర్తి, దుగ్గ మహేందర్, గచ్చకాయల రాజు, బొమ్మ పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో..

ముకరంపుర, జూలై 14: మున్నూరు కాపు విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఈలు నరేందర్, కే రాజు, ఏఈలు రామ్మోహన్, చంద్రయ్య, లైన్ మెన్‌లు రాజలింగం, ప్రకాశ్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ క్లాస్‌మేట్స్ ఆధ్వర్యంలో..

కార్పొరేషన్, జూలై 14: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ని కరీంనగర్‌లోని సైన్స్ వింగ్ కళాశాలలో తనతో పాటు చదివిన ఇంటర్ క్లాస్‌మేట్స్ ఆదివారం ఒక ప్రైవేట్ హోటల్‌లో కలిసి ఘనంగా సన్మానించారు. త్వరలో ఇంటర్ క్లాస్‌మేట్స్ జరిపే ఆత్మీయ సమ్మేళనానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో దాసరి రాజన్ బాబు, జాలి శ్రీనివాస్ రెడ్డి, గర్శకుర్తి నర్సయ్య, నాగభూషణం, దాసిన శ్రీనివాస్ బాబు, బంధం మల్లారెడ్డి, వసంత రెడ్డి, సిరిసిల్ల వాసు, కార్పొరేటర్లు నాంపల్లి శ్రీనివాస్, గంది మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో బదిలీల సందడి

- నేడు సీనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్

కార్పొరేషన్, జూలై 14: కరీంనగర్ నగరపాలక సంస్థలో బదిలీల నేపథ్యంలో ఉద్యోగుల సందడి నెలకొన్నది. నగరపాలక సంస్థలో పలువురు ఉద్యోగులు, అధికారులు ఏళ్ల తరబడిగా ఇక్కడే పని చేస్తున్నారు. వీరిలో నాలుగేళ్ల పైబడిన వారు అధిక సంఖ్యలోనే ఉన్నారు. దీంతో ఈ సారి ప్రభుత్వం చేపడుతున్న బదిలీల్లో పెద్ద సంఖ్యలో నగరపాలక ఉద్యోగులు బదిలీ అవుతారన్న చర్చ జోరుగా సాగుతున్నది. ఇప్పటికే ఇంజినీరింగ్ విభాగంలోని పలువురు అధికారులు ఇక్కడి నుంచి బదిలీ చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితో పాటు నగరపాలక సంస్థలోనే తిష్ట వేసిన ఉద్యోగులను బదిలీ చేయాలని పలువురు కార్పొరేటర్లు ఇప్పటికే మంత్రుల దృష్టికి తీసుకుపోయారు. దీంతో ఈ సారి నగరపాలక సంస్థలో ఉన్న ఉద్యోగుల్లో ఎంత మంది బదిలీ అవుతారన్న ఆసక్తి నెలకొన్నది. దీనిలో భాగంగా సోమవారం వరంగల్ రీజినల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లు, యూడీఆర్ఐలు, హెల్త్ అసిస్టెంట్లు, సీనియర్ అకౌంటెంట్స్‌లకు బదిలీ కౌన్సెలింగ్ ఉంటుందని సర్క్యులర్ విడుదలైంది. ఆమేరకు ఉద్యోగులు ఆ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

‘గ్రెయిన్ చైన్స్’ పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

కమాన్ చౌరస్తా, జూలై 14: నగరంలోని ఫిలింభవన్‌లో సాహితీ సోపతి, ఎస్సీ ఫ్రెండ్స్, కఫిసా సంయుక్త ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కవి అన్నవరం దేవేందర్ తెలుగులో రాసిన వరిగొలుసులు పుస్తకాన్ని ‘గ్రెయిన్ చైన్స్’ పేరిట సవ్యసాచి ఆంగ్లంలోకి అనువదించగా, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ ఆవిష్కరించారు. పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్‌కు అంకితమిచ్చి సన్మానించారు. కార్యక్రమంలో అనువాదకుడు, విద్యాదేవ విశేట్టి శంకర్, గాజోజు నాగభూషణం, నంది శ్రీనివాస్, రావుల శశిధర్, వేముల సత్యనారాయణ మాట్లాడారు. ఆంగ్ల కవి జే పర శురామారావు పుస్తక పరిచయం చేశారు. అష్టాదశ శక్తి పీఠాల ప్రాభవంపై డాక్టర్ కృష్ణసాహితి చేసిన నృత్యం ఎంతగానో ఆకట్టుకున్నది. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. బూర్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమన్వయ కర్తలు సీవీ కుమార్, మాడిశెట్టి గోపాల్, కవులు, రచయితలు, కళాకారులు పాల్గొన్నారు.

పాడుపు సంఘం సామూహిక నిధి అందజేత

చిగురుమామిడి, జూలై 14: రేకొండ గ్రామంలో రేకొండ పురుషుల పాడుపు సంఘం సభ్యుడు మైలారపు సంపత్ మృతిచెందగా, అతడి భార్య ప్రవంతికి సంఘం తరపున సామూహిక నిధి, అభయ నిధి, పాడుపు, బోనస్ కలిపి 48వేలకు పైగా రూపాయలను ఆదివారం సైదాపూర్ మండల సమితి అధ్యక్షుడు పైడిపల్లి రవీందర్ గౌడ్, సంఘం గ్రామాధ్యక్షుడు చెంచల దిలీప్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పెండ్యాల రాజేందర్, పాలకవర్గ సభ్యులు గొడిశాల శ్రీనివాస్, కటుకోజుల రవీంద్రాచారి, చెంచల సురేశ్, నీల భూమయ్య, పందిపల్లి తిరుపతి, అరిగెల రమేశ్, చెంచల వెంకటేశ్, చెంచల భూమయ్య, పిక్కల అంజయ్య, పీరల్ల తిరుపతి, సమితి గణకుడు అనగోని వీరన్న, సంఘం గణకుడు నాగుల మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిగురుమామిడి, జూలై 14: మండలంలోని చిగురుమామిడి, సుందరగిరి, బొమ్మనపల్లి, రేకొండ గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా, ఆదివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో అత్యధికంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయని తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిట్టి మల్ల రవీందర్, మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, జిల్లా అధికార ప్రతినిధులు దాసరి ప్రవీణ్ కుమార్, ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల నాయకులు ఠాకూర్ నరేందర్ సింగ్, పొన్నం సంపత్, మైపాల్ రెడ్డి, ఎండీ షాబుద్దీన్, గ్రామాధ్యక్షులు వంగ కనకయ్య, ఎనగందుల లక్ష్మణ్, కుత్బుద్దీన్, సంజీవ్, రమేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపల్లి వాసికి భారతీయ నారీ శక్తి అవార్డు ప్రదానం

తెలంగాణచౌక్, జూలై 14: గన్నేరువరం మండలం గుండ్లపల్లికి చెందిన ప్రముఖ గాయకురాలు మంగళ కృష్ణవేణి అంతర్జాతీయ భారతీయ నారీ శక్తి అవార్డు అందుకున్నారు. స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ పీస్ ఆఫ్ ఇండియా ఎన్జీవో, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, ఆసియా వేదిక కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంగళ కృష్ణవేణి మాట్లాడుతూ, ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు.

వివేకానంద కళాశాలలో హరితహారం

మొక్క నాటుతున్న వివేకానంద కళాశాల బాధ్యులు

హౌసింగ్‌బోర్డుకాలనీ, జూలై 14: నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా ఆదివారం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నామని తెలిపారు. అలాగే ఈ సంవత్సరం తమ కళాశాల ఆవరణలో నీడనిచ్చే మొక్కలను నాటి వాటికి ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సాగర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, సంరక్షణ బాధ్యతను కూడా స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఏవో బీ శ్రవణ్ కుమార్, ఏసీవో బీ సంపత్ కుమార్, బీ రామేశ్వర్ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బైరం మహేశ్, కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీల అమలుకు ప్రభుత్వాలపై పోరాటం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి

చిగురుమామిడి, జూలై 14: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేసే సమయం ఆసన్నమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లంబాడి పల్లి గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకుడు కయ్యం వీరయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు నెరవేర్చాలన్నారు. పార్టీ బలోపేతం కోసం గ్రామ కమిటీల సమావేశం నిర్వహించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కార్యకర్తలను సన్నద్ధం చేస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి, మాజీ సర్పంచ్ నాగేల్లి వకుళాదేవి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ముద్రకోల రాజయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీపీఐ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామాధ్యక్షుడిగా కయ్యం తిరుపతి, సహాయ కార్యదర్శిగా అనుమాసుల మల్లారెడ్డి, కోశాధికారిగా చందబోయిన కనకయ్య, ఏఐఎస్ఎఫ్ బాధ్యుడిగా పచ్చిమట్ల రాము, ఏఐవైఎఫ్ బాధ్యుడిగా వెంకటేశ్, వ్యవసాయ కార్మిక సంఘం బాధ్యుడిగా చందబోయిన ఎల్లయ్య, రైతు సంఘం బాధ్యుడిగా కోతి కనకయ్య, మహిళా సమాఖ్య బాధ్యులుగా కయ్యం సుజాత, నాగెల్లి కళావతిని ఎన్నుకున్నట్లు మండల కార్యదర్శి లక్ష్మారెడ్డి తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

తిమ్మాపూర్, జూలై 14: నిరుద్యోగ